క్లుప్తంగా

పల్లకీలో ఊరేగిన రంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా సోమవారం స్వామి వారిని సతీసమేతంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ముందుగా మూలవిరాట్ రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవిలకు ఉదయం బిందె సేవ, అభిషేకం, అష్టోత్తరనామార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయంలో ప్రదక్షిణ కార్యక్రమాలు చేశారు. దేవాలయ కమిటీ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తగా 93 మందికి పింఛన్లు

తుగ్గలి: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి పింఛన్ లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 7,993 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో కొత్తగా 93 మందికి పింఛన్లు మంజరైనట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. 3న పగిడిరాయిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతులమీదుగా పింఛన్ల పంపిణీ ప్రారంభించనున్నట్లు ఆమె చెప్పారు.

పేదలకు చీరల పంపిణీ



కృష్ణగిరి చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కృష్ణగిరి చర్చిలో సోమవారం ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో ఎంపీపీ పాల్గొన్నారు. ఫాస్టర్ వెంకటరాముడు చర్చి పరిధిలోని 25 మహిళలకు చీరలు, 10 మంది పురుషులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక రక్షకుడైన ఏసు మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీని సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, నారాయణ, చిన్నన్న, రమణారెడ్డి, సుంకన్న, సత్యం, సంఘం పెద్దలు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్ సమీపంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కిషోర్‌కు గాయాలయ్యాయి. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా కిషోర్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముంగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో బైకు అదుపుతప్పి సిమెంట్ రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ కిషోర్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు సోమవారం బంధువులు తెలిపారు.

యువకుడిపై దాడి



దాడిలో గాయపడ్డ మహబూబ్

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి మహబూబ్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనివాస సర్కిల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్‌ను అటుగా వెళ్లిన వారు గమనించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తల, శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు సోమవారం సాయంత్రం తెలిపారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష 2.0

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2న ఎద్దులదొడ్డి, జొన్నగిరి-2, ముక్కెల్ల, 5న జీ.ఎర్రగుడి, 6న రాతన, 9న ఉప్పర్లపల్లి, 12న గిరిగెట్ల, 15న రామకొండ, 16న చెన్నంపల్లి, బొందిమడుగుల, 19న కడమకుంట్ల, 22న రాంపల్లి, 23న మారెల్ల, పెండేకల్లు, 26న శభాష్‌పురం, జొన్నగిరి సచివాలయ-1లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్దికెర: మండలంలో నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. 2వ తేదీ బురుజుల, 9న పెరవలి, 19న మద్దికెర -3, 30న ఎం.అగ్రహారం, ఫిబ్రవరి 9న హంప, 16న బసినేపల్లి, 23న మద్దికెర-4, మార్చి 5న మద్దికెర-2లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి కష్టాలకు చెక్

- జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- గోనెగండ్ల మండలానికి రూ.38 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



గోనెగండ్లలో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ఇది కదా అభివృద్ధి

గోనెగండ్ల: ప్రజల మంచినీటి కష్టాలు తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసింది. దీంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చి నీటిని సరఫరా చేయనున్నారు. ఇప్పటికే ఆ దిశగా పనులు వేగంగా సాగుతున్నాయి. మండల ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు జలజీవన్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండలంలోని 28 గ్రామాలకు రూ.38 కోట్ల నిధులు మంజూరు చేశాయి. ఆ నిధులతో గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి సురక్షిత మంచినీరు అందించేందుకు అధికారులు అంచనాలు తయారు చేశారు. ఇప్పటికే ఆ గ్రామాల్లో 7వేల కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. మండలంలోని గాజులదిన్నె, హెచ్.కైరవాడి, కులుమాల, పెద్దనేలటూర్, చిన్ననేలటూర్, పుట్టపాశం, వేముగోడు, పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, వీరంపల్లి గ్రామాలకు మల్టీవిలేజ్ స్కీం కింద గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. మిగతా గ్రామాలకు ప్రస్తుతం ఉన్న ట్యాంకుల నుంచి అలాగే అవసరమైన చోట ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి పైపులైన్ ద్వారా మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. 2024 నాటికి మండలంలో 9 వేల కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే మండలంలో వేముగోడు, కున్నూరు గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. మిగతా గ్రామాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో మంచినీటి కుళాయి అవసరమైతే పంచాయతీ కమిటీ తీర్మానం చేసి, నిర్దేశించిన రుసుం చెల్లించిన వారికీ మాత్రమే అనుమతులు ఇచ్చేవారు. ఇందుకు చాలా సమయం పట్టడమే గాకుండా నాయకుల అండదండలు ఉన్న వారికి త్వరగా పూర్తయ్యేవి. ప్రస్తుతం కేవలం అర్హతే ప్రామాణికంగా తీసుకొని పనులు చేస్తున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 28 గ్రామాల్లో 23 సచివాలయాలు ఉన్నాయి. వీటన్నింటి పరిధిలో త్వరలోనే ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నారు.

ఇంటింటికీ మంచినీటి కొళాయి



మండలంలో 11 గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మల్టీ విలేజ్ స్కీం కింద మంచినీరు సరఫరా చేస్తాం. మిగతా గ్రామాలకు ఆయా గ్రామాల్లో ఉన్న ఎస్ఎస్ ట్యాంకులు, ఓహెచ్ఆర్ ట్యాంకుల నుంచి మంచి నీటిని అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. దీనిలో భాగంగా ఎక్కడెక్కడ ట్యాంకులు, పైపులైన్లు వేయాలి. కొత్త లైన్లు అంచనాలను రూపొందించాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఆ పనులన్నీ పూర్తయితే ఇక ఏ గ్రామంలో మంచినీటి సమస్య ఉండదు.

– శ్రీనివాస రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గోనెగండ్ల

అయోధ్య అక్షింతల ఊరేగింపు



నెల్లిబండలో కలశాలతో అయోధ్య అక్షింతలు, గోమాతను ఊరేగిస్తున్న ప్రజలు

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో సోమవారం గ్రామ విచారమంచ్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు.అలాగే గోమాతను కూడా ఊరేగించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున కదిలివచ్చి గోమాతకు కడవలతో నీళ్ల పోసి పూజలు నిర్వహించారు. వక్తలు అయోధ్య రామ జన్మభూమి గురించి వివరించారు. హిందువులందరూ ఏకం కావాలని, హిందువుల మధ్య ఐక్యత నెలకొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ కార్యదర్శి సావిత్రి, ఆర్ఎస్ఎస్ ఆరోగ్యభారతి జిల్లా విభాగ్ కార్యవాహకులు కృష్ణవేణి, గ్రామ వికాస సమితి నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, వీహెచ్‌పీ భీమేష్, కరివేముల కౌలుట్లయ్య, ఎస్ఎస్ఎఫ్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వందవాగిలి రోడ్డుకు మహర్దశ



నేడు - రాకపోకలకు సౌకర్యంగా మారిన వందవాగిలి రోడ్డు



నాడు - టీడీపీ హయాంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

హొళగుంద: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవతో దశాబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోని వందవాగిలి రోడ్డు ఎట్టకేలకు బాగయ్యింది. ఆదోని క్రాస్ నుంచి వందవాగిలి గ్రామం వరకు 6 కి.మీ దూరం ఉంది. అందులో నాలుగున్నర కి.మీ వరకు రోడ్డు బాగున్నా మిగిలిన వందవాగిలి గ్రామం నుంచి గాదిలింగప్ప ఆలయం వరకు 1.5 కి.మీ రోడ్డు రాళ్లు తేలి గుంతలమయంగా మారి అధ్వానంగా ఉండేది. రోడ్డు దుస్థితిపై గ్రామస్తులు గత టీడీపీ హయాంలో అనేక సార్లు అధికారులు, పాలకుల వద్ద మొరపెట్టుకున్న ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఆ కాసింత దెబ్బతిన్న రోడ్డులో గ్రామానికి చేరుకోవడానికి నిత్యం ప్రయాణంలో నరకం చూసే ప్రజలకు మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్య పరిష్కరించారు. తారు రోడ్డు ఏర్పాటుకు రూ.45 లక్షలు ఏబీబీ నిధులను మంజూరు చేయించడంతో రోడ్డు బాగై రాకపోకలకు సౌకర్యంగా మారింది. దీంతో ఆ గ్రామస్తులు మంత్రితో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మేలగిరి, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, ఎంపీటీసీ లక్ష్మీకాంతరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు



గాయపడ్డ ఆర్ఎంపీ మాధవకృష్ణ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని హైవే-44పై మదార్‌పురం వద్ద రోడ్డు దాటుతున్న బైకిస్టును కారు ఢీకొట్టింది. మల్కాపురం ఆర్ఎంపీ కున్నూరు మాధవకృష్ణ బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటే ప్రయత్నం చేయగా కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కారుపై పడ్డ ఆర్ఎంపీ తీవ్ర గాయాలపాలయ్యాడు. హైవే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని తమ వాహనంలో వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు



పెండేకల్లు రైల్వే జంక్షన్ నుంచి ఇరుముడితో బయలుదేరిన అయ్యప్పస్వాములు

తుగ్గలి: 40 రోజుల పాటు నియమనిష్టలతో మాల ధరించిన అయ్యప్ప స్వాములు పెండేకల్లు రైల్వే జంక్షన్ నుంచి శబరిమలకు బయలుదేరారు. సోమవారం గ్రామంలో మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు పూజలు నిర్వహించి మాలధారులకు ఇరుముడి కట్టారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరై స్వాములను సాగనంపారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం ఫలపుష్పాలతో అలంకరించారు. భక్తులు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

తాగునీటిని పంటలకు మళ్లిస్తే చర్యలు



నీటి అక్రమ మళ్లింపునకు ఉపయోగిస్తున్న పైపులను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ డీఈ

ఎమ్మిగనూరుటౌన్: తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీలో నిల్వ ఉంచిన నీటిని పంటలకు మళ్లించేందుకు పైపులు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి ఎల్లెల్సీ, గుడికల్ చెరువు, ఎస్ఎస్ ట్యాంకులపై పెట్రోలింగ్ చేస్తుండగా కాలువలో నిల్వ చేసిన నీటిని గుడికల్‌కు చెందిన కొందరు రైతులు పైపుల ద్వారా పంటలకు మళ్లిస్తుండడాన్ని గమనించి మున్సిపల్ సిబ్బంది పైపులను స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు ప్రస్తుతం ఎల్లెల్సీలో వచ్చిన నీటిని నిలువ ఉంచుకోవడం జరిగిందని ఆ నీటిని పంటలకు మళ్లిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని డీఈ హెచ్చరించారు. కాలువలో ప్రస్తుతం వచ్చిన నీటిని మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

దేవనకొండ: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం దేవనకొండలో సచివాలయ ఉద్యోగులు జెడ్పీటీసీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలని, రైతులు, అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. జాతిపిత మహాత్మాగాంధీజీ కన్న కలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నాడని, గ్రామస్థాయిలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నాడన్నారు. సచివాలయ సిబ్బంది ఆదర్శంగా పనిచేయాలని సూచించారు.

ఊరూ వాడా నూతన శోభ



పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్

ఎమ్మిగనూరుటౌన్: నూతన సంవత్సర వేడుకలు సోమవారం పట్టణంలో అట్టహాసంగా జరిగాయి, పిల్లాపెద్దలతో పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి నుండే ఒకరికొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఎమ్మెల్యే స్వగృహానికి అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో సందడిగా మారింది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది, డీఈలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలబొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డికి పట్టణంలోని వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్, నాయకులు, ఎంపీడీఓలు బంగారమ్మ, ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ అంజినేయులు, అధికారులు, పూలబొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ బుట్టారంగయ్య, ఎంపీపీ కేశన్న, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్‌ను పార్టీ శ్రేణులు ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పత్తికొండటౌన్: గ్రామాల్లో గొడవలు, ఫ్యాక్షన్ వీడి అభివృద్ధి చేసేవారికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. సోమవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వేడుకలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యేకు పూలమాలలు, బొకేలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో వైఎస్సార్‌సీపీ కార్యాలయం కిటకిటలాడింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరికీ మేలు జరగాలని, అన్ని పనులలో శుభం కలగాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేయాలని, జగనన్నకు అండగా నిలవాలని కోరారు. పత్తికొండ పోలీసు సబ్‌డివిజన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసుసిబ్బంది ఎమ్మెల్యేను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీపీలు నారాయణదాసు, ఆదెమ్మ, అనితాయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు ఉరుకుందమ్మ, పులికొండ నాయక్, మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్లు నాగరాజు, జిట్టా నాగేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గోనెగండ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ టీ.నసురుద్దీన్, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీఓ బంగారమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఇతర అధికారులు, ఆయా గ్రామాల నాయకులు ఎంపీపీ గొల్ల కేశన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో సీఐ, ఎస్ఐలకు సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు.

మద్దికెర: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు తదితరులకు కార్యకర్తలు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, వారి కుటుంబీకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల నాయకులు, అభిమానులతో కోలాహలం కనిపించింది. పూలమాలలు, బొకేలు హోరెత్తగా పలువురు నాయకులు పెన్నులు, పుస్తకాలు, పూల మొక్కలు అందించిన శుభాకాంక్షలు తెలిపారు. అర్ధరాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు మండలంలోని 63 చర్చిలలో ప్రార్థనలు, మత బోధనలు, పలు సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లు జరిగాయి.

కృష్ణగిరి: నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డికి వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూల మొక్కలు, నోట్ పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి ఎంపీపీ వేడుకల్లో పాల్గొన్నారు.

తుగ్గలి: కొత్త సంవత్సరం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఎంపీపీ ఆదెమ్మ, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

పత్తికొండ రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి సేవాదళ్ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యాలయం ముందు 3 వేల కుటుంబాలకు సంబంధించి అందరి సమక్షంలో 5 విభాగాలుగా లక్కీ డ్రా తీశారు. బహుమతులు వరుసగా బంగారు కమ్మలు, గ్రైండర్, రైస్‌కుక్కర్, ప్రెజర్‌కుక్కర్, డిన్నర్‌సెట్‌లను 25మంది మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర కానుకగా సేవాదళ్ కుటుంబ సభ్యులకు రూ.200 వంటగ్యాస్ సబ్సిడీ అందిస్తామన్నారు. అలాగే ప్రతి సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పేరుతో 'రాజన్న భోజనం' అందిస్తామని చెప్పారు. నాయకులు బనావత్ లక్ష్మీదేవి, కోటేశ్వర రావు, అనిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద న్యూ ఇయర్ కేక్‌ను మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్దన కట్ చేసి స్వీట్లు పంచారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, సొసైటీ సీఈఓ అశోక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు.

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని కురువ సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మాదాసి/మాదారి కురువ సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వివిధ గ్రామాల కురువ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను రెవెన్యూ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. డీటీ లక్ష్మి, ఆర్ఐ రామారావు, సీనియర్ అసిస్టెంట్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంథోని ఆధ్వర్యంలో సిబ్బంది వేడుకలు నిర్వహించారు.



ఎమ్మిగనూరులో ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ టీ.నసురుద్దీన్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్



నందవరంలో లక్ష్మీకాంతరెడ్డికి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



చెరుకులపాడులో ప్రదీప్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రామళ్లకోట నాయకులు



పత్తికొండ సేవాదళ్ కార్యాలయం వద్ద లక్కీడ్రా తీస్తున్న పి.మురళీధర్‌రెడ్డి



కురువ సంఘం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మోహన్‌ప్రసాద్



ఆస్పరి సొసైటీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కట్టెల గోవర్ధన

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని మంగళవారం నుంచి గ్రామాల్లో వారంలో ఒక రోజు క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ రామస్వామి, వైద్యాధికారి ప్రదీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం టి.గోకులపాడు గ్రామంలో నలుగురు డాక్టర్లతో కూడిన బృందంతో క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి విడత ఈ క్యాంపులు సక్సెస్ కావడంతో ప్రభుత్వం రెండో విడత కింద ఈ కార్యక్రమం చేపడుతుందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే 12న తొగర్చేడు, 19న అమకతాడు, 23న కటారుకొండ, 30న పోతుగల్లు, ఫిబ్రవరి 6న లక్కసాగరం, 13న చుంచుఎర్రగుడి, 20న కోయిలకొండ, మార్చి 1న ఎస్‌హెచ్ ఎర్రగుడి, 12న ఆలంకొండ, 22న కంబాలపాడు, ఏప్రిల్ 12న చిట్యాల, 19న ఎరుకలచెరువు గ్రామాల్లో సురక్ష క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

నేడు హొళగుందలో గ్రామసభ

హొళగుంద: స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ ఉంటుందని, ప్రజలు పాల్గొని తమ సమస్యలను పాలక మండలి దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. హొళగుంద పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఇతర అన్ని సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడంతో పాటు పంచాయతీ నిధుల వినియోగం, వనరులు, ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందని వివరించారు. వార్డు సభ్యులతో పాటు గ్రామస్తులు గ్రామసభకు హాజరు కావాలని ఆయన కోరారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

కౌతాళం: రైతులు పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం ఉదయం మండల కేంద్రంలో కార్యదర్శి చెన్నయ్య అధ్యక్షతన, సాయంత్రం కామవరం గ్రామంలో సర్పంచ్ వసంత అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం డ్రోన్ల ద్వారా పంటలపై మందులను పిచికారీ చేసే విధానాన్ని పొలాలకు వెళ్లి రైతులకు ప్రత్యక్షంగా చూయించారు. నాయకుడు సుబ్బారాజు, ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఏపీఎం రాజశేఖర్, వీఆర్ఓ, వలంటీర్లు, బీజేపీ నాయకులు చిన్న ఈరన్న, పెద్ద ఈరన్న పాల్గొన్నారు.